క్లుప్తంగా

పోస్టర్ రహిత నగరంలో భాగస్వాములు కావాలి

- కార్పొరేషన్ ప్రజారోగ్యాధికారి సాంబమూర్తి



గోడలపై పోస్టర్లను తొలగిస్తున్న కార్మికుడు

విజయనగరం: పోస్టర్ రహిత నగరంగా తీర్చిదిద్దే ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజయనగరం ప్రజారోగ్య అధికారి కె.సాంబమూర్తి పిలుపునిచ్చారు. నగరంలో వివిధ చోట్ల గోడలపై పోస్టర్లు అతికించడాన్ని గమనించి తక్షణమే వాటిని తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో ప్రత్యేక బృందాలు వివిధ ప్రాంతాలలో పర్యటించి గోడలపై ఉన్న పోస్టర్లను తొలగించారు. అలాగే గోడలపై రాతలను కూడా చెరిపేశారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ.. గోడలపై పోస్టర్లు అతికించినా, రాతలు రాసినా సందరు సంస్థలకు నోటీసులు జారీ చేయడంతో పాటు అపరాధ రుసుం విధిస్తామన్నారు. ఈ విషయంలో ప్రజలు సహకరించాలని కోరారు.

అబ్దుల్ రవూఫ్‌కు సన్మానం



అబ్దుల్ రవూఫ్‌ను సన్మానిస్తున్న డాక్టర్ తిరుమల ప్రసాద్

విజయనగరం ఫోర్ట్: గాంధీ బ్లడ్ డోనర్స్‌క్లబ్ అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త అబ్దుల్ రవూఫ్‌ను తిరుమల మెడికవర్ ఆస్పత్రి ఎం.డి తిరుమల ప్రసాద్ శనివారం ఘనంగా సన్మానించారు. 1000 గుండె శస్త్రచికిత్సలకు లైవ్ బ్లడ్ అందించినందుకు గాను రవూఫ్‌ను సన్మానించినట్లు డాక్టర్ తిరుమల ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శరత్‌కుమార్ పాత్రో, డాక్టర్ కిరణ్, డాక్టర్ పీఎస్‌వీ రామారావు, డాక్టర్ జి. రామారావు, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ అఖిల్, ఆస్పత్రి సెంటర్ హెడ్ మల్లికార్జున రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సర్కిల్ కార్యాలయం ప్రారంభం



శృంగవరపుకోట రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీఐ అప్పలనాయుడు

లక్కవరపుకోట: స్థానిక గ్రామ సచివాలయం పై అంతస్తులో శృంగవరపుకోట రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని సీఐ ఎల్.అప్పలనాయుడు శనివారం ప్రారంభించారు. గత ప్రభు త్వంలో లక్కవరపుకోట, జామి,వేపాడ మండలాలను కలిపి శృంగవరపుకోట రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌ను వేపాడ మండలంలోని బొద్దాంలో ఓ ప్రైవేటు భవనంలో ఏర్పాటు చేశారు. శృంగవరపుకోట ఒక్క మండలాన్ని ఒక సర్కిల్‌గా చేసి అక్కడి పోలీస్ స్టేషన్‌లోనే సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేశారు. తాజాగా జిల్లా కలెక్టర్ నుంచి పోలీస్ శాఖ ప్రత్యేక అనుమతు లు తీసుకొని రూరల్ సర్కిల్ కార్యాలయాలన్ని బొద్దాం నుంచి లక్కవరపుకోటలోని సచివాల యంపై అంతస్తులోకి మార్చారు. నూతన కార్యాలయం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎల్.కోట, జామి ఎస్‌ఐలు నవీన్‌పడాల్, వీర జనార్దన్, ఎల్.కోట మేజర్ పంచాయతీ సర్పంచ్ కె్రు పార్వతి,మాజీ ఎంపీటీసీ మల్ల రామకృష్ణ పాల్గొన్నారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టొద్దు




సీసీ ఫుటేజీ దృశ్యాలు పరిశీలిస్తున్న సీఐ సతీష్‌కుమార్

బొబ్బిలిరూరల్: మండలంలోని రాముడువలస గ్రామ బాపిస్ట్ చర్చి వద్ద ఆ చర్చి నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సీఐ సతీష్‌కుమార్ శనివారం పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో అన్యమత ప్రచారాలు జరుగుతున్న దృష్ట్యా అన్ని మతాల ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎవరూ మత విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని సీఐ సూచించారు. నేరాల నియంత్రణలో ఉపయోగపడుతున్నాయన్న నేపథ్యంలో వీలైనంత మందితో ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఆదాయ సముపార్జనే లక్ష్యం..

- పన్నుల వసూళ్లలో వరుస ఆఫర్లు ప్రకటిస్తున్న మున్సిపల్ శాఖ
- నెలాఖరులోగా పన్ను మొత్తం చెల్లించే వారికి 5 శాతం రాయితీ
- పాత బకాయిల చెల్లింపులపై 50 శాతం వడ్డీ రాయితీ పొడిగింపు
- తాజాగా ఉత్తర్వులు జారీ చేసిన అధికారులు



నగరంలోని భవన సముదాయాలు

విజయనగరం: మున్సిపల్ శాఖ అధికారులు ఆదాయ సముపార్జనే లక్ష్యంగా వరుస ఆఫర్లు ప్రకటిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతత స్థానిక సంస్థలకు ఆశించిన స్థాయిలో నిధులు మంజూరు చేయకపోగా.. పన్నుల రూపంలో ప్రజల నుంచి ఆదాయాన్ని రాబట్టేందుకు చర్యలు చేపట్టడం గమనార్హం. 2024 – 25 ఆర్థిక సంవత్సరం ముగిసి నూతన ఆర్థిక సంవత్సరంలోకి అడుగిడిన సందర్భంగా ప్రతి ఏడాది మాదిరిగా ఈ ఏడాది కూడా ముందుస్తుగా ఏడాది మొత్తం పన్ను చెల్లించేవారికి 5 శాతం రాయితీ ప్రకటించారు. గతేడాదికి చెందిన పన్ను బకాయిలు చెల్లించే వారికి కూడా వడ్డీపై 50 శాతం రాయితీ ప్రకటించారు. వాస్తవానికి ఈ అవకాశం మార్చి 31 వరకే ఉన్నా.. మళ్లీ తాజాగా ఈ నెలాఖరు వరకు పొడిగించారు.

గడువు పొడిగింపు..

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు వివిధ మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఆస్తి పన్ను చెల్లింపుదారులకు మున్సిపల్ శాఖాధికారులు మరో ఆఫర్ ప్రకటించారు. గతేడాది మార్చి నెలాఖరు వరకు ఉన్న ఆస్తి పన్ను బకాయిలను ఒకేసారి ఈ నెలాఖరులోగా చెల్లించిన వారికి పన్ను వడ్డీపై 50 శాతం రాయితీ ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 25న పన్ను రాయితీ ప్రకటించగా.. చివరి 5 రోజులు నగరవాసులు పెద్ద ఎత్తున వడ్డీ రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (ఈ నెల 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు (ప్రస్తుత ఆర్థిక సంవత్సరం) పన్నును ఒకేసారి చెల్లిస్తే పన్ను మొత్తంలో ఐదు శాతం రాయితీ కల్పిస్తున్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

నగరంలో ఇదీ పరిస్థితి..

అధికారిక లెక్కల ప్రకారం కార్పొరేషన్ పరిధిలో 70,273 అసెస్‌మెంట్‌లు ఉండగా... వాటి ద్వారా ఆస్తిపన్ను రూపంలో 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి రూ.31.89 కోట్ల ఆదాయం రావాల్సి ఉండగా.. రూ.27.33 కోట్లు వసూలు కాగా మరో రూ.4.56 కోట్లు బకాయిలున్నాయి. అదేవిధంగా గత ఆర్థిక సంవత్సరాల్లో వసూలు కాని మొండి బకాయిలు రూ.20.04 కోట్లు ఉండగా... కేవలం రూ.6.59 కోట్లు వసూలైంది. మరో రూ.13.45 కోట్లు వసూలు కావాల్సి ఉంది. మొత్తంగా రూ.33 కోట్లు పైగా వసూలు చేయగా.. రూ. 17 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఇదిలా ఉంటే నూతన ఆర్థిక సంవత్సరంలో రూ. 32 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాల్సి ఉంది.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి..

ఆస్తి పన్ను బకాయిదారులకు మున్సిపల్ శాఖ ఆఫర్లు ప్రకటించింది. ఇప్పటివరకు బకాయి ఉన్న ఆస్తి పన్ను మొత్తాన్ని చెల్లించిన వారికి 50 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుంది. అదేవిధంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పన్ను మొత్తం చెల్లించే వారికి 5 శాతం రాయితీ వర్తిస్తుంది. ఈ నెలాఖరులోగా పన్ను బకాయిలు చెల్లించిన వారికే ఈ ఆఫర్లు వర్తిస్తాయి. ప్రజలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

– పల్లి నల్లనయ్య, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

అనుమానాలను నివృత్తి చేయాలి

- జిల్లా క్రిస్టియన్ ఫెడరేషన్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్.జాన్

విజయనగరం టౌన్: పాస్టర్ ప్రవీణ్ మృతిపై క్రైస్తవ సమాజానికి ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని జిలా క్రిస్టియన్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని జిల్లా కమిటీలు, పాస్టర్లు, ఫెలోషిప్‌లన్నీ సంయుక్తంగా జిల్లా క్రిస్టియన్ ఫెడరేషన్‌గా ఏర్పడి పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణార్థం శనివారం స్థానిక సిమ్స్ బాప్టిస్ట్ చర్చిలో ఆదరణ స్తుతి కూడిక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో చర్చి కార్యదర్శి ఆర్‌ఎస్.జాన్ మాట్లాడుతూ.. ప్రవీణ్ మృతి క్రైస్తవులకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో ఆదాడ మోహన్, పాస్టర్ జాన్ మోజేస్, పొంద్రంకి వెంకటరమణ, తాలాడ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలు, దళితులకు రక్షణ లేదు



నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్

విజయనగరం గంటస్తంభం: బీజేపీ అధికారంలోకి వచ్చాక మైనార్టీలు, దళితులు, క్రైస్తవులకు రక్షణ లేకుండా పోయిందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ ఆరోపించారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ దేశ వ్యాప్త పిలుపులో భాగంగా శనివారం స్థానిక అంబేడ్కర్ జంక్షన్‌లో వక్ఫ్ బోర్డు సవరణ చట్టం జీఓ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వక్ఫ్ చట్ట సవరణ ద్వారా ముస్లిం ధార్మిక, సామాజిక, సాంస్కృతిక సంస్థలపై దాడి తలపెట్టనున్నారని ఆరోపించారు. వక్ఫ్ బిల్లుపై చర్చ సమయంలో వక్ఫ్ బోర్డు డబ్బును మైనారిటీల సాధికారత కోసం వినియోగిస్తామని బీజేపీ నేతలు బూటకపు హామీలు ఇచ్చారన్నారు. మైనారిటీ విద్యార్థులకు ఇచ్చే మౌలానా ఆజాద్ స్కాలర్‌షిప్‌లను నిలిపివేయడాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. విజయనగరం జిల్లా ముస్లిం సమాఖ్య నాయకుడు షేక్ అస్లాం మాట్లాడుతూ.. ముస్లింల భూములు కొల్లగొట్టే నల్ల చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 16న చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూర వాసు, విజయనగరం జిల్లా ముస్లిం సమాఖ్య నాయకులు మహమ్మద్ షరీఫ్, షేక్ ముస్తఫా, అబ్దుల్ రహమాన్, సయ్యద్ ఇంతియాజ్, షేక్ దావుద్, కార్మికులు పాల్గొన్నారు.

చురుగ్గా స్పీడ్‌బ్రేకర్ల ఏర్పాటు పనులు

విజయనగరం: నగరంలోని అంబటిసత్రం నుంచి నీళ్లట్యాంక్ జంక్షన్ వరకు ఉన్న ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు ఇటీవల రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన విషయం విధితమే. నిత్యం ప్రయాణికుల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ మార్గంలో తరచుగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తుండటంతో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.రాయల్‌బాబు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు జరగకుండా అవసరమైన అన్ని చర్యలను చేపడుతున్నామన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు మరో అవకాశం

రామభద్రపురం: కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)ల్లో ప్రవేశాలకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఇదివరకు ఈ కళాశాల్లో అడ్మిషన్లకు ఇచ్చిన గడువు ముగియగా, ఇప్పుడు ఈ నెల 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేస్తూ ఉత్తర్వులు జారీ కావడం విశేషం. బూసాయవలస కేజీబీవీలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం బైపీసీలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హులంతా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.దీప శనివారం తెలిపారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

సంతకవిటి: సంతకవిటి మండలం, జావాం గ్రామంలో అంతర్‌జిల్లా వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. పగడాలమ్మ జాతర మహోత్సవంలో భాగంగా జరుగుతున్న ఈ పోటీలకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అరకు జిల్లాల వాలీబాల్ జట్లు హాజరై, సత్తా చాటుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే ఈ మ్యాచ్‌లు ఎంతో ఉత్కంఠభరితంగా కొనసాగుతున్నాయి. జాతరకు వచ్చిన వారంతా ఈ పోటీలను చూసి ఆనందిస్తున్నారు.

‘ఉపాధి’ పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



కేంద్ర ప్రభుత్వానికి రాసిన లేఖను చూపిస్తున్న బాబ్జీ, తదితరులు

- లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ

విజయనగరం గంటస్తంభం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రావాల్సిన ఉపాధిహామీ పథకం పెండింగ్ బిల్లులను కేంద్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. బిల్లుల కోసం వేతనదారులతో పాటుగా కాంట్రాక్టర్లు ఎదురుచూస్తున్నారని అందుకే కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శివరరాజ్‌సింగ్ చౌహాన్, సహాయ మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేష్ పాశ్వాన్‌లకు లేఖ రాసినట్లు తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో ఉపాధిహామీ పథకం పెండింగ్ బిల్లులు సుమారు 2090 కోట్ల రూపాయలు ఉన్నాయని, శ్రీకాకుళం జిల్లాలో రూ. 197 కోట్లు, ప్రకాశం రూ. 122 కోట్లు, తిరుపతి రూ. 118 కోట్లు, అల్లూరి సీతారామరాజు జిల్లా రూ. 113 కోట్లు, విజయనగరం జిల్లాకు 111 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లె పండగ కార్యక్రమం పేరిట గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్లు, కాలువలు, బీటి రోడ్లు, చెక్‌పిట్స్, మినీ గోకులాల పనులకు సంబంధించిన బిల్లులు కూడా మంజూరు కాలేదని చెప్పారు. రాష్ట్ర పరిస్థితిని అర్థం చేసుకుని కేంద్ర ప్రభుత్వం వెంటనే చెల్లింపులు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు నాగభూషణం, పీఎల్‌ఎన్.రాజు, రమేష్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీనివాస కళాశాల ప్రభంజనం



సి. వర్షిణి (ఎంపీసీ, 987)



కె. లక్ష్మీపార్వతి (బైపీసీ, 975)



డి. చైతన్య (హెచ్ఈసీ, 462)



సీహెచ్ హేమంత్ (ఎంపీసీ, 462)



ఎస్‌కే సమీర (బైపీసీ, 429)

విజయనగరం: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాల్లో నగరంలోని శ్రీనివాస జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో ప్రభంజనం సృష్టించారు. శనివారం విడుదలైన ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి సత్తా చాటారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో పి.సిరి వర్షిణి ఎంపీసీ విభాగంలో 987 మార్కులు కైవసం చేసుకోగా... కె.లక్ష్మీపార్వతీ బైపీసీ విభాగంలో 975 మార్కులు సాధించింది. అదేవిధంగా ప్రథమ సంవత్సర ఫలితాల్లో సీహెచ్.హేమంత్‌కుమార్ ఎంపీసీ విభాగంలో 462 మార్కులు, ఎస్. సమీరా బైపీసీ విభాగంలో 429 మార్కులు, జి.చైతన్య హెచ్‌ఈసీ విభాగంలో 462 మార్కులు సాధించారు. అంతేకాకుండా ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 1000 మార్కులకు గాను 46 మంది విద్యార్థులు 900కి పైగా మార్కులు సాధించారు. అదేవిధంగా ప్రథమ సంవత్సర ఫలితాల్లో 470 మార్కులకు 50 మంది విద్యార్థులు 400కి పైగా మార్కులు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ యు.వేణుగోపాలరావు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

సత్తా చాటిన సూర్యోదయ

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని సూర్యోదయ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. మెరుగైన ఫలితాలు సాధించారని యాజమ్యాం తెలిపింది. నక్కాన రమ్య (బైపీసీ, 988/1000), చిల్లా రామసూర్రెడ్డి (ఎంపీసీ 465/470) మార్కులతో రాణించారు. ఈ మేరకు విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

శ్రీవెంకటరమణ విజయదుందుభి..



విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్న చైర్మన్, అధ్యాపకులు తల్లిదండ్రులు

విజయనగరం అర్బన్: పట్టణానికి చెందిన శ్రీ వెంకటరమణ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో దత్తి అవినాష్ 465 /470, యు. ధీరజ్ 464/ 470, ఎల్.విశ్వేశ్వరరావు 461/470, పి.ప్రణీత 461/470 మార్కులు సాధించారు. ఎంపీసీలో 460 మార్కులు పైబడిన వారు 11 మంది, 450 మార్కులు పైబడిన వారు 22 మంది ఉన్నారు. విద్యార్థులను ఎస్‌వీఆర్ కాలేజ్ చైర్మన్ ఎస్. వెంకటరమణ, సిబ్బంది అభినందించారు.

ఆర్‌కే జయకేతనం..



విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తున్న కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం

విజయనగరం అర్బన్: ఇంటర్ ఫలితాల్లో ఆర్‌కే జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఎంపీసీ గ్రూప్‌లో గేదేల గుణ అభిషేక్ 464/ 470.. కోట్ల మణిదీప్‌నాయుడు 463/470.. సోమయాజుల వీడీఎస్ శ్రీవాత్సవ 463/470.. బైపీసీలో దూసి దేవాంశ్ 433/440 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో అన్నంపూడి రాగచంద్రిక ఎంపీసీలో 987/ 1000 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల యజమాన్యం కోలా సంతోష్, డైరెక్టర్ అంజన, డీన్ ఎ. శ్రీనివాసనాయుడు, తదితరులు విద్యార్థులను అభినందించారు.

వేంకటేశ్వర అకాడమీలో ఉత్తమ ఫలితాలు



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ అండ్ డైరెక్టర్ గుప్తా

విజయనగరం అర్బన్: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర ఏఐఏటీ ఐఐటీ నీట్ అకాడమీ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ అండ్ డైరెక్టర్ చెరుకూరి గుప్తా తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో బైపీసీలో పాయల్‌సింగ్ 987/1000, వి.మను 982/1000 మార్కులు సాధించారన్నారు. ఈ మేరకు 970కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో ‘ఆదర్శం’



ఈశ్వర కార్తీక్ (458)



ఎం. వెన్నెల (414)



పార్వతి (387)



సమీర (964)



ఆరుద్ర (964)



ఆశిష్ (961)



అమూల్య (872)



సౌమ్య (868)

- రాణించిన ఆదర్శ, మోడల్ స్కూల్, కేజీబీవీ విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో సత్తా చాటారు. ప్రథమ సంవత్సరంలో 83 శాతం, ద్వితీయ సంవత్సరంలో 99 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ మొదటి ఏడాదిలో జి ఈశ్వర కార్తీక్ (ఎంపీసీ, 485/470).. ఎం.వెన్నెల (బైపీసీ, 414/440).. పి. పార్వతి (సీఈసీ, 387/500) టాపర్లుగా నిలిచారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో డి. ఆరుద్ర (ఎంపీసీ, 964/1000).. సమీర (ఎంపీసీ 964/1000)..పి.ఆశిష్ (బైపీసీ 961/1000).. ఎల్. అమూల్య (సీఈసీ,872/1000).. ఎస్. సౌమ్య (ఎంఈసీ,863/1000) మార్కులతో సత్తా చాటారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ శైలజ, ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు.

మోడల్ స్కూల్‌లో ఉత్తమ ఫలితాలు

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్‌స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థి టిక్కలి సురేష్ వెయ్యికి 962 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచారు. ఎంపీసీ విద్యార్థిని దువ్వ రమా 958, బైపీసీ విద్యార్థిని బొట్టా దేవి 956, బైపీసీ విద్యార్థిని కొట్యాడ మేఘన 952 మార్కులతో మెరిశారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో దాడిశెట్టి మేఘన 470 మార్కులను గాను 463 మార్కులు, బోర లక్ష్మి 462.. బైపీసీ విభాగంలో జి.నిస్సిప్రకాష్ 440 మార్కులకు గాను 426 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 83శాతం, ద్వితీయ సంవత్సరంలో 99 శాతం ఉత్తీర్ణత సాధించారు.



టిక్కలి సురేష్ (962)



దువ్వు రమ (958)



బొట్ట దేవి (956)



కొట్యాన మేఘన (952)

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

డెంకాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థి కర్రి సతీష్ (బైపీసీ, 937/1000), వి.నందిని 909 మార్కులతో సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరంలో 48 శాతం ఉత్తీర్ణత సాధించారు.

కేజీబీవీ విద్యార్థుల హవా

నెల్లిమర్ల: కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో సత్తాచాటారు. ఈ కళాశాల నుంచి ఇంటర్ సెకెండియర్ ఎంపీసీ విద్యార్థులు 20 మంది పరీక్షలు రాయగా వారిలో 19 మంది ఉత్తీర్ణత సాధించారు. జూనియర్ ఇంటర్ విద్యార్థులు 30 మందికి 29 మంది పాసయ్యారు. ఓవరాల్‌గా 96 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ బి ఉమ, అధ్యాపకులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



వేతనదారులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రేగిడి: మండలంలోని చాటాయివలస గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల వద్ద ప్రకృతి వ్యవసాయంపై శనివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ఎల్2 గౌరీశ్వరరావు, ఐసీఆర్‌పీలు పి.తవిటి నాయుడు, టి.గోవిందమ్మలు.. ప్రకృతి సేద్యం ద్వారా కలిగే ప్రయోజనాలను వేతనదారులకు వివరించారు. ప్రకృతి సాగులో తక్కువ పెట్టుబడితో ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. అలాగే నేల సారవంతానికి ఎకరా పొలంలో 12 కిలోల నవధాన్యాలు వేసుకుని 45 రోజుల తర్వాత కలియదున్నుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు